క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు పడమటివీధిలో నూతనంగా నిర్మించిన అనంత కోదండరామస్వామి ఆలయం వద్ద అగ్నిగుండ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. పండరి భజన గురువు కృష్ణయ్య దాసు ఆధ్వర్యంలో పండరి భజన నేర్చుకున్న బృందంతో పాటు పలువురు గ్రామస్తులు అగ్నిగుండం తొక్కారు.

వ్యాసరచన పోటీలు



ఉదయగిరి రూరల్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో బిజ్జంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆవాజ్ కమిటీ సభ్యుడు నాయబ్‌రసూల్ మాట్లాడుతూ కలాం జయంతి సందర్భంగా తమ కమిటీ ఆధ్వర్యంలో ఏటా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఫరీద్‌బాషా, రవికుమార్, రాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



ఆత్మకూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈ నెల 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ కే వేణుగోపాల్, సీఐలు ఎం గంగాధర్, వేమారెడ్డిల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మంత్రి ఆనం ప్రారంభించి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐలు, పోలీసులతో పాటు కళాశాలల విద్యార్థులు సుమారు వంద మందికిపైగా రక్తదానం చేశారు. ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయిప్రసాద్, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ వీ కేశవ చౌదరి, బీజేపీ నేతలు ఆంజనేయరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న లలితా రుద్రమహాయజ్ఞం



సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి జ్ఞానపీఠంలో లోక కళ్యాణంకోసం 45 రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన లలితా రుద్రమహాయజ్ఞం శనివారం నాటికి 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి భక్తులకు జ్ఞానబోధ చేశారు. దుర్లభమైన మానవ జన్మను అందరూ నవ విధ భక్తి ద్వారా సార్థకత చేసుకోవాలన్నారు. లౌకిక సుఖాలు అశాశ్వతమైనవని, శివపార్వతుల నామస్మరణ, ధ్యానం, ప్రాణాయామం ద్వారా ఆరోగ్యం, మనశ్శాంతి, కార్యసిద్ధిని పొందవచ్చునన్నారు. సమస్యలు సహజమని, ధర్మబుద్ధితో జీవనం గడిపితే దేవతల అనుగ్రహం తప్పక లభిస్తుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన



అనుమసముద్రంపేట: మండలంలోని శ్రీకొలను జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జిల్లా డైట్ అధికారి ఎల్ నటరాజన్‌మూర్తి శనివారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. తొలుత క్లస్టర్ సమావేశంలో పాల్గొని పాఠశాలల వారీగా విద్యార్థుల ప్రగతిపై సమీక్షించారు. పదోతరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి నూరుశాతం ఫలితాలను సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓలు జ్యోతి, సాయికుమార్, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఎన్నడో?



వేంపాడు పంచాయతీ పరిధిలోని వెంగమాంబపురం గ్రామానికి చెందిన రైతులు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం నిరీక్షిస్తున్నారు. లోఓల్టేజ్ సమస్యను ఎదుర్కొంటున్న రైతులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యుత్‌శాఖకు సుమారు రెండేళ్ల క్రితం నగదు చెల్లించారు. అప్పట్నుంచి ఇప్పటి వరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులను వేడుకుంటే స్తంభాలను మాత్రం నాటారని, ఆ తరువాత ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. రబీ సీజన్ ప్రారంభమవుతున్నందున పంటలకు ఇబ్బంది లేకుండా ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించాలని వారు కోరుతున్నారు.

– వరికుంటపాడు

రోడ్లపైనే మురుగు ప్రవాహం

అనుమసముద్రంపేటలోని పలు వీధుల్లో డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో పారిశుధ్యం లోపించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. మరోవైపు రోడ్లపై రాకపోకలు సాగించేందుకు నరకాన్ని చవిచూస్తున్నారు. మురుగు సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లించకపోవడంతో దోమలు ప్రబలి విషజ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మండలాధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించి మురుగు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– అనుమసముద్రంపేట



దర్గావీధిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

ప్రమాదభరితంగా బ్రిడ్జి



డీసీపల్లి నుంచి వెన్నవాడకు వెళ్లే మార్గంలో ఉత్తరకాలువపై బ్రిడ్జి ప్రమాదభరితంగా ఉంది. బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. బ్రిడిపై రోడ్డు దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరుతుండడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో పది గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జి దుస్థితికి చేరినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– మర్రిపాడు

విద్యుత్ లైన్‌మెన్ లేక అవస్థ

దగదర్తి : మండలంలోని ఉలవపాళ్ల పంచాయతీలో గత ఐదేళ్లుగా విద్యుత్ లైన్‌మెన్ లేకపోవడంతో విద్యుత్ సమస్యలు తలెత్తిన సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి విద్యుత్‌ను సరఫరా చేసే లైన్ జామాయిల్ తోటల మీదుగా వస్తుంది. దీంతో చిన్నపాటి గాలి వీచిన, చినుకుపడిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ కారణంగా వ్యవసాయ విద్యుత్ మోటర్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రాత్రి వేళల్లో విద్యుత్ లైన్లలో మరమ్మతులకు గురైతే ప్రజలు జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మరుసటి రోజు పక్క పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ వచ్చి మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించే వరకు వేచి ఉండాల్సిందే. మండలంలో 20 పంచాయతీలు, వాటి పరిధిలో సుమారు 30 గ్రామాలు ఉన్నాయి. 8 మంది లైన్‌మెన్లు, 9 మంది జూనియర్, ఇద్దరు అసిస్టెంట్ లైన్‌మెన్లు, ఇద్దరు లైన్‌ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఉలవపాళ్ల పంచాయతీ పరిధిలో గతంలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై మరణించారు. అప్పట్నుంచి లైన్‌మెన్ పోస్టు ఖాళీగా ఉంది. పంచాయతీ పరిధిలో తరచూ విద్యుత్‌లైన్లు మరమ్మతులకు గురవుతూ సరఫరా నిలిచిపోతుండడంతో ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. వర్షాకాలంలో బోర్ల కింద పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులు లైన్‌మెన్ లేకపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి పంచాయతీకి లైన్‌మెన్‌ను నియమించాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈ ఖాజాను సంప్రదించగా గతంలో ఉన్న లైన్‌మెన్ విధి నిర్వహణలో విద్యుత్‌షాక్‌కు గురై మరణించారని, అప్పట్నుంచి లైన్‌మెన్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఉన్నతాధికారులకు నివేదించి త్వరలోనే పంచాయతీకి లైన్‌మెన్‌ను నియమిస్తామన్నారు. అనంతవరం పంచాయతీ లైన్‌మెన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించామని, ఉలవపాళ్లలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

రోడ్డు విస్తరణపై సర్వే



సర్వేపై చర్చిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మెయిన్ రోడ్డు విస్తరణపై శనివారం సర్వే చేపట్టారు. ఇన్‌చార్జి తహసీల్దార్ గిరీష్‌కుమార్ పర్యవేక్షణలో రెవెన్యూ, సర్వే సిబ్బంది మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా కొలతలు వేశారు. మెయిన్ రోడ్డు మధ్య నుంచి ఇరువువైపుల 37 అడుగుల మేర విస్తరణ చేపడితే గంగమ్మ గుడి, రామాలయంతో పాటు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ, రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలు కట్టడాలు పోతాయని పలువురు గ్రామపెద్దలు, గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఫుట్‌పాత్ నిర్మాణం కోసం రోడ్డుకు ఇరువైపులా 42 అడుగుల మేర తొలగిస్తే షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు నష్టపోతారు. రోడ్డుకు ఇరువైపులా నిర్మాణాలు ఎక్కువగా గ్రామనత్తంలో ఉన్నందున కట్టడాలకు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారు. మార్కింగ్ ఇస్తే త్వరితగతిన డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతామని రెవెన్యూ అధికారులను జాతీయ రహదారి కాంట్రాక్టర్ కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి పూర్తి స్థాయిలో సర్వే చేపట్టి మార్కింగ్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే చర్చలు సాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంఈఓ-1 వెంకటేశ్వర్లు

ఉదయగిరి రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంఈఓ-1 టీ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గడ్డంవారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. తొలుత పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థి దశ నుంచే మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. అనంతరం క్లస్టర్ సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. క్లస్టర్ సమావేశాలు విజ్ఞాన భాండాగారాలుగా తయారవ్వాలన్నారు. ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ చైర్మన్ మాలకొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలకు అనుమతి పొందిన వారు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని, ఆత్మకూరు తహసీల్దార్ పద్మజాకుమారి శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన ఖాళీ స్థలాల్లోనే దుకాణాలను ఏర్పాటు చేసుకుని విక్రయించాలన్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా దుకాణాల వద్ద తగిన భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శని, ఆది, సోమవారాల్లో మాత్రమే టపాసుల విక్రయాలకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. గ్రీన్ టపాసులు మాత్రమే విక్రయించాలని, నిషేధించిన రసాయనాలు కలిగిన టపాసులు విక్రయించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేయడమేగాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మొక్కలు నాటుతున్న సిబ్బంది



కలిగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఉదయగిరి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని ఎంపీడీఓ బీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పర్యావరణంపై అధికారులు అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించి పంచాయతీ బస్టాండ్ వద్ద మానవహారం నిర్మించారు. సేల్‌ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్వీ సుబ్బారావు, ఎంవీఐ గోపీనాయక్, సహాయ ఎంవీఐ కరుణాకర్, హెచ్‌ఎం జీ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీఓ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు పంచాయతీ బస్టాండ్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ రామారావు, ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎం మాలకొండయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మెయిన్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. మొక్కలు నాటడం,కాలుష్య రహిత వాహనాలు, సోలార్ పలకల వినియోగంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రాగి దివ్య, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించి ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.315

మర్రిపాడు: డీసీపల్లిలోని పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు గరిష్ఠంగా రూ.315 ధర లభించింది.వేలానికి వేలానికి 1408 బేళ్లు రాగా, 972 బేళ్లను విక్రయించారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.315, కనిష్ఠంగా రూ.60, సగటున రూ.135.25 ధర లభించిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

లైసెన్స్‌లు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ఉదయగిరి: దీపావళి సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా లైసెన్స్‌లు లేకుండా బాణసంచా విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఉదయగిరి అగ్నిమాపక శాఖ అధికారి హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరిలో ఐదు, సీతారామపురంలో నాలుగు, వరికుంటపాడులో ఒక దుకాణానికి తాత్కాలికంగా లైసెన్సులు మంజూరు చేసినట్లు చెప్పారు. లైసెన్స్‌లు పొందిన వారు నిబంధనల మేరకు దుకాణాలను ఏర్పాటు చేసుకుని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పీఎంఆదర్శ గ్రామ యోజనకు జనార్ధనపురం ఎంపిక

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల జనార్దనపురం పంచాయతీ ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామపంచాయతీ యోజనకు ఎంపికైందని ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనార్ధనపురంలో ఎస్సీలు 43 శాతం ఉండడడంతో ఈ పథకానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. పీఎం ఆదర్శ గ్రామ యోజన కింద గ్రామానికి రూ.20 లక్షలు మంజూరయ్యాని చెప్పారు. ఈ నిధులతో గ్రామంలో అవసరమైన మౌలిక వసతులను కల్పించనున్నట్లు తెలిపారు.

ఉరుస్తున్న తహసీల్దార్ కార్యాలయం



ఉదయగిరి రూరల్: పట్టణంలోని బ్రిటీష్ కాలం నాటి తహసీల్దార్ కార్యాలయ భవనం పూర్తిగా దెబ్బతింది. గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉరుస్తుండడంతో రికార్డులు, కంప్యూటర్లు తడిసిపోకుండా కాపాడుకునేందుకు సిబ్బంది కుస్తీ పడుతున్నారు. వాటిపై ఫ్లెక్సీలు, పట్టలను కప్పి భద్రపరుస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకణకు అవకాశం

వింజమూరు(ఉదయగిరి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ స్కీం కింద ఈ నెల 23వ తేదీలోగా అనుమతి లేని లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి, వింజమూరు పంచాయతీ ఈఓ రామారావు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలో 25 లేఅవుట్లకు గానూ రెండు లేఅవుట్లకు మాత్రమే నుడా అనుమతులు ఉన్నాయని తెలిపారు. మిగిలిన వాటి యజమానులు 14 శాతం నగదును చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని, లేని పక్షంలో లేఅవుట్లను తొలగిస్తామన్నారు.

జీఎస్టీ 2.0తో ప్రజలకు లబ్ధి



ఆత్మకూరు: జీఎస్టీపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం



కావలిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- మంత్రి ఆనం

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0తో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని నెల్లూరుపాళెం సెంటర్ నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు జీఎస్టీ 2.0, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. నెల్లూరుపాళెం సెంటర్ వద్ద జీఎస్టీ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చందర్, తదితరులతో కలిసి మంత్రి ఆనం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. జీఎస్టీ 2.0తో అన్ని రకాల వస్తువుల ధరలు తగ్గాయని తెలిపారు. అనంతరం 111 మంది బాధితులకు రూ.85.50 లక్షల విలువ గల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. 125 మంది మున్సిపల్ కార్మికులకు రూ.6 లక్షల విలువైన రెండు జతల దుస్తులు, కాస్మోటిక్స్ కిట్లను అందజేశారు. అనంతరం మున్సిపల్ డంపింగ్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసి చెత్తను రీసైక్లింగ్ చేసే యంత్రాలను కమిషనర్ సీ గంగాప్రసాద్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

ఉదయగిరి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రవాణా శాఖ, సేల్‌ట్యాక్స్ అధికారులు జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 99 రకాల వస్తువులపై 28 నుంచి 18 శాతానికి తగ్గించిందని తెలిపారు. వివిధ రకాల వాహనాలు, వస్తువుల ధరలు తగ్గాయన్నారు. ప్రజలు కొనుగోలు చేసే సమయంలో గతంలోని ధర, ప్రస్తుతం ధరను అడిగి తెలుసుకోవాలన్నారు. సేల్‌ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సుబ్బారావు, ఎంవీఐ, అసిస్టెంట్ ఎంవీఐలు గోపి నాయక్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

కావలి(అల్లూరు): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0తో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని కావలి ప్రాంతీయ రవాణా అధికారి ఎం మురళీధర్‌రావు అన్నారు. కావలి రవాణా శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముసునూరు వద్ద వాహనదారులకు జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించారు. అనంతరం బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎంవీఐ సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐ లక్ష్మీభాయ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన వెంకటకృష్ణ

దగదర్తి : మండలంలోని అల్లూరు రోడ్డు రైల్వే బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఏలూరుకు చెందిన బాలె వెంకటకృష్ణ కోవూరు మండలం ఇనమడుగులో చేపలగుంటలు సాగుచేస్తున్నారు. శనివారం ఉదయం తన స్వగ్రామం ఏలూరుకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో అల్లూరు రోడ్డు రైల్వే బ్రిడ్జి వద్దకు రాగానే మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెనుకగా కారులో మంగళగిరికి వెళ్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి క్షతగాత్రుడ్ని గమనించి తన సిబ్బందితో సహాయ చర్యలు చేపట్టారు. అనంతరం హైవే అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

విద్యుత్ స్తంభంపై చెలరేగిన మంటలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని మెయిన్‌రోడ్ నుంచి శ్రీవివేకానంద కళాశాలకు వెళ్లే రహదారి సమీపంలోని ఓ దుకాణం వద్ద ఉన్న విద్యుత్ స్తంభంపై శనివారం మంటలు చెలరేగాయి. అక్కడ అదృష్టవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్తంభంపై విద్యుత్తు వైర్లతో పాటు డిష్ వైర్లు కూడా ఉన్నాయి. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పెద్దవి కావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ట్రాన్స్‌కో అధికారులు ఘటనను పరిశీలించారు. విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన



ఆత్మకూరు: మున్సిపల్, మండల పరిధిలోని 23 ఉన్నత పాఠశాలల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది.8,9,10 తరగతులకు చెందిన సుమారు 1400 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలుత పట్టణంలోని వెస్ట్ హైస్కూల్‌లో హెచ్‌ఎం షేక్ ఫయాజ్, టాలెంట్ టెస్ట్ పత్రాలను విడుదల చేశారు. పాఠశాల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి నవంబరు 1న మండల స్థాయి పోటీ పరీక్షలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జేవీవీ సీనియర్ నాయకులు షేక్ సందానీ, పార్లపల్లి సుధాకర్‌రావు, పెంచలయ్య, మహబూబ్‌బాషా, రెడ్‌క్రాస్ కార్యదర్శి సాధిక్ హుస్సేన్, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



దాతలను సన్మానిస్తున్న హెచ్‌ఎం

ఉదయగిరి రూరల్: బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు అందించిన సహకారం మరువలేనిదని హెచ్‌ఎం జే మాధవరావు పేర్కొన్నారు. బిజ్జంపల్లి ఉన్నత పాఠశాలలో దాతలను ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సహకారంతో సరస్వతి విగ్రహ ఆవరణలో ఏర్పాటు చేసిన పార్కింగ్ టైల్స్‌ను ప్రారంభించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలను దాతలు ఎంతో అభివృద్ధి చేసి మండలంలోనే ఆదర్శ పాఠశాలగా గుర్తింపు తెస్తున్నారన్నారు. ఇప్పటికే లైబ్రరీకి అవసరమైన ఇనుప ర్యాక్‌లు, ఐరన్ బీరువా, మైక్ సెట్, తదితరాలను దాతలు అందించారని తెలిపారు. పాఠశాలల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.